## పోస్టర్లను ఆవిష్కరించిన 'సండ్ర'

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లిటౌన్, ఆగస్టు 12: సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సండ్ర వెంకటవీరయ్య జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ యువ జన నాయకుడు షేక్ హుస్సేన్ ముద్రించిన పోస్టర్లను స్థానిక క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ.. ఆగస్టు 15న మాజీ ఎమ్మెల్యే సండ్ర జన్మదినం సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా అంటించేందుకు వీటిని ముద్రించినట్లు వివరించారు. మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, నాయకులు దొడ్డా హైమావతి శంకర్‌రావు, కొత్తూరు ఉమా మహేశ్వరరావు, మల్లూరు అంకంరాజు తదితరులు పాల్గొన్నారు.

## 'పోడుభూముల రైతులందరికీ పట్టాలివ్వాలి'

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సత్తుపల్లి టౌన్, ఆగస్టు 12: సత్తుపల్లి డివిజన్‌లో పోడు భూములు, ప్రభుత్వ భూము లు సాగు చేసుకుంటున్న రైతులందరికీ పట్టాలు మంజూరు చేయాలని న్యూడెమోక్రసీ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు ఉమర్ మాట్లాడుతూ 1994 నుంచి సాగుచేసుకుంటున్న గిరిజన, గిరిజనేతర రైతులందరికీ పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

## 'ఓటరు జాబితాను పకడ్బందీగా నిర్వహించాలి'

వేంసూరు, ఆగస్టు 12: పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ఓటర్ల జాబితాను పకడ్బందీ రూపొందించాలని డీఎల్‌పీవో తేజావత్ రాంబాబు కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాను తయారు చేసినప్పుడు నిబంధనలు పాటించాలని సూచించారు. అలాగే, జాతీయ పంచాయతీ అవార్డుల విషయంలో ఇతర శాఖల నుంచి వివరాలు సేకరించి ఆయా శాఖల అధికారుల సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అనంతరం నూతనంగా కల్లూరు డీఎల్‌పీవోగా వచ్చిన రాంబాబును కార్యదర్శులు శాలువా, బోకెతో సన్మానించారు. ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

**ప్రకటన**

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మధిర బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **హరోత్ తావు**, S/o: సూర్య,వయస్సు : 35సం॥లు, నివాసం: ఇ.నెం. 7-722/1, లక్ష్మీపురం గ్రామం, గుబ్బగుర్తి, కొణిజర్ల మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 8 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్షయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి:** ఖమ్మం జిల్లా, ఆళ్ళపాడు రిజిస్ట్రారు మరియు మధిర సబ్ రిజిస్ట్రారు వారి అధికార పరిధిలోని, ఖమ్మం జిల్లా, బోనకల్ మండల పరిధిలోని రావినూతల గ్రామం నందు గల A.C Sheet Roof గృహము ఇ.నెం. 6-89/1, (Assessment No. 1247) భాళీ యుక్తమగా గల మొత్తం విస్తీర్ణము : 657-00 చ॥గ॥ లు 549.33 చ॥మీ॥ A.C.Sheet Roof గృహ నిర్మాణ వైశాల్యం 300.00 Sq.fts. అందు గల ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్, విద్యుత్ సర్వీసు మరియు సమస్త శానిటరీ ఫిక్చర్స్ సహా **దాక్యుమెంట్ నెం. 2174/2024**, గల స్థిరాస్తికి సరిహద్దులు : **తూర్పు :** దారి గారి యొక్క ఇల్లు, **పడమర :** ఆర్ & బి రోడ్డు, **ఉత్తరం :** గ్రామపంచాయితీ రోడ్డు, **దక్షిణము :** బి. తిరుపతి మరియు బి. సైదులు గారి ఇల్లులు మరియు కె.లక్ష్మి గారి యొక్క భాళీ స్థలము.

**జి.హరేందర్ రెడ్డి**
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

## సమగ్ర శిక్ష ఉద్యోగులకు నివాళి

బోనకల్లు, ఆగస్టు 12: విద్యాశాఖలో సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు పనిభారం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా మృతి చెందిన వారికి సోమవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు పుల్లారాణి మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల సీఆర్‌పీ దాసు, ఆదిలాబాద్ జిల్లాలో ఐఈఆర్‌పీ మమత గుండెపోటుతో మృతిచెందారన్నారు. 15 సంవత్సరాల నుంచి వెట్టిచాకరి చేస్తూ ఉద్యోగ భద్రత లేక అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీసీవో మల్లికార్జున్, సీఆర్‌పీ మీరా, కేజీబీవీ ఉపాధ్యాయినులు రాణి, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

# నిరంతరం ప్రజల సేవలోనే నిమగ్నం కావాలి

- ఏ గ్రామ కార్యదర్శి ఆ గ్రామంలోనే నివాసముండాలి
- ఏఈవోలకు కూడా ఇదే విధానం వర్తిస్తుంది
- వచ్చేవారం నుంచి అమలు జరగాలి
- పర్యవేక్షణ బాధ్యత ఎంపీడీవోలదే
- సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం రూరల్, ఆగస్టు 12: నిద్రలేచింది మొదలు నిత్యం గ్రామ కార్యదర్శులు ప్రజల సేవలోనే ఉండాలని రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని బైపాస్ రోడ్డులోగల టీసీవీ ఫంక్షన్‌హాల్‌లో పాలేరు నియోజకవర్గస్థాయి వ్యవసాయ, పంచాయతీ తదితరశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్ పంచాయతీ కార్యదర్శులు నుంచి ఆయా గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి పంచాయతీ కార్యదర్శి గ్రామాల్లోనే నివాసముండాలని, వచ్చే వారం నుంచి అమల్లోకి రావాలని మంత్రి ఆదేశించారు. రాబోవు ఏడదిలోపు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలలో రోడ్లు, డ్రైనేజి సమస్య తీరుతుందని,అత్యవసరమైతే తన దృష్టికి తీసుకవస్తే తక్షణం నిర్మాణం జరిగే విధంగా చూస్తానన్నారు. పలువురు సిబ్బంది పాఠశాలలకు 200 మీటర్లలోపు మద్యం షాపులకు అనుమంతి ఇచ్చారని, వివరాలు సేకరించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

### ప్రజలను వేధిస్తే-టార్గెట్ చేస్తా

ఎవరిపని వారు చేసుకుంటూ పోతే ఎవరిని మందిలించనని, ఏదైన పనికోసం ప్రజలు ఆయా గ్రామాల్లో పని చేస్తున్న ప్రభుత్వ సిబ్బంది దగ్గరికి వచ్చిన సమయంలో వారి దగ్గర ఏదైన ఆశించి ఇబ్బందులకు గురి చేసినట్లు తన దగ్గరికి వస్తే కచ్చితంగా టార్గెట్ చేస్తానని పొంగులేటి హెచ్చరించారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతు అర్హులైన పింఛన్‌దారులను గుర్తించాలని, అనర్హులకు పింఛన్ ఇవ్వవద్దన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు సమన్వయం చేసుకొని పనిచేయాలన్నారు. రాబోయే కొద్ది రోజుల్లోనే ప్రతి గ్రామంలో తన సొంత ఖర్చులతో ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయిస్తానన్నారు. పామాయిల్ సాగు విస్తీర్ణంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముధుసూదన్‌నాయక్, జడ్పీసీఈవో నాగలక్ష్మి, డీపీవో హరికిషన్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎం విజయనిర్మల, ఏడీఏ విజయచంద్ర, ఉద్యానశాఖ అధికారి అపర్ణ, నాలుగు మండలాల ఎంపీడీవోలు, ఎంపీవోలు, సంబందితశాఖల అధికారులు పాల్గొన్నారు.

## 'మహిళా శక్తి రుణాలతో ఆర్థికంగా రాణించాలి'

యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఏపీఎం శారద, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి

రఘునాథపాలెం, ఆగస్టు 12: ప్రభుత్వం అందించే మహిళా శక్తి రుణాలతో స్వయం సహాయక సంఘాల గ్రూపుల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులైన మహిళలు ఆర్థికంగా రాణించాలని ఏపీఎం శారద సూచించారు. మహిళా శక్తి పథకంలో భాగంగా మండలంలోని వీ వెంకటాయపాలెంలో ఇద్దరు సభ్యులకు మంజూరైన యూనిట్లను సోమవారం ఆమె ప్రారంభించారు. వెన్నెల గ్రూపు సభ్యురాలు కృష్ణవేణికి జిరాక్స్, స్టేషనరీ యూనిట్‌ను; శ్రీకృష్ణ గ్రూపు సభ్యురాలు భూక్యా దివ్యకు డీజే సౌండ్ సిస్టమ్ యూనిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా శక్తి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, వీవో అధ్యక్షులు గౌరమ్మ, అనిత, సీసీలు భిక్షమయ్య, జ్యోతి, వెంకటేశ్వరరావు, వీవోఏ అనురాధ, వసంత, సావిత్రి, సుభద్ర పాల్గొన్నారు.

## భరతనాట్యంలో చిన్నారుల ప్రతిభ

ఖమ్మం, ఆగస్టు 12 : ఖమ్మం నగరానికి చెందిన అభినయ రుద్ర నాట్యాలయం చిన్నారులు భరతనాట్యంలో ప్రతిభ చాటారు. ఇండోనేపాల్ కల్చరల్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో 8వ జాతీయ స్థాయి నృత్య చాంపియన్‌షిప్ పోటీలు-2024 హైదరాబాద్‌లోని సాంస్కృతిక భవన్‌లో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ భరతనాట్యం పోటీల్లో విద్యార్థినులు సీనియర్స్ గ్రూప్ విభాగంలో రెండు, జూనియర్స్ విభాగంలో మొదటి, సబ్ జూనియర్ విభాగంలో మొదటి బహుమతులు గెలుపొందారు. గురువు కణతాల ఫణీల్‌కు ట్రోఫీతో పాటు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. విద్యార్థినులు రిధి, జి.వైశాలి, త్రిషిక, కమలిక, జైకీర్తన, నయోనిక, హంషిక, డి.వైశాలి, జషిత, సహస్ర, హన్మిక, ఎం.శాన్వి, కృతిక, మాన్విత, ఆర్.శాన్వి, వర్జిక, భవిష్య పాల్గొన్నారు.

## 'పిల్లల మనోవికాసానికి బాలసాహిత్యం దోహదం'

సత్తుపల్లి, ఆగస్టు 12: పాఠశాలల్లో చదివే విద్యార్థులు భాషతోపాటు మనోవికాసాన్ని నేర్చుకోవడం కోసం బాలసాహిత్యం ఎంతగానో దోహదపడుతుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. గ్రంథపాలకుల దినోత్సవం, ఎమ్మెల్యే రాగమయి జన్మదినం సందర్భంగా సత్తుపల్లి సృజన సాహితీ సమాఖ్య నిర్వాహకులు సోమవారం ఆమెను కలిసి తమ సంస్థ ద్వారా ప్రచురించిన బాలసాహిత్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలు విద్యార్థి దశ నుంచి పాఠ్యపుస్తకాలతో పాటు ఇలాంటి పుస్తకాలను కూడా చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని ఆకాంక్షించాఉ. రామకృష్ణ, నాగేశ్వరరావు, మాధుసూదన్‌రాజు, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాడెయిరీకి స్థలం అప్పగింత

ఎర్రుపాలెం, ఆగస్టు 12: ఇందిరా మహిళా డైరీకి సర్వేనెంబర్ 18లో 30 గుంటల భూమిని ఆర్ఐ రవికుమార్, సర్వేయర్ రాజశేఖర్ స్వాధీన పత్రాలను ఏపీఎం వెంకటేశ్వర్లుకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఐకేపీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'గ్రామాల్లో విష జ్వరాల వ్యాప్తిని అరికట్టాలి'

కొణిజర్ల, ఆగస్టు 12: గ్రామాల్లో విషజ్వరాల వ్యాప్తిని అరికట్టాలని పీవోడబ్ల్యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొణిజర్ల ఎంపీడీవో కార్యాలయ అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు గోకినేపల్లి లలిత, టీ.ఝాన్సీ మాట్లాడుతూ.. ఖమ్మంలో 287 డెంగీ కేసులు నమోదయ్యాయని, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో గ్రామాలు మూలుగుతున్నాయని అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఆరోగ్య అత్యవసర పరిస్థితిని ప్రకటించాలని కోరారు. సంఘం నాయకులు మోదుగుల లాలయ్య, నునావత్ నీల, సాయమ్మ, సంధ్య, రేవతి, యశోద తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

కొణిజర్ల, ఆగస్టు 12: మండలంలోని సింగరాయపాలెం, ఉప్పలచెలక ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మై ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ (ఎంఎఫ్‌వో) బాధ్యులు సోమవారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. స్నేహితులుందరూ కలిసి ఎంఎఫ్‌వోను స్థాపించుకొని వారు సంపాదనలో కొంత మొత్తాన్ని కూడబెట్టి ఏటా విద్యార్థులకు తోడ్పాటునివ్వడం అభినందనీయమని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అన్నారు. ఎంఎఫ్‌వో బాధ్యులు కట్టా చంద్రబాబు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

బోనకల్లు, ఆగస్టు 12: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్, ఎంపీడీవో లకావత్ రాజు అన్నారు. సోమవారం స్త్రీ శక్తి కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాల సభ్యురాలు స్వయం ఉపాధి కోసం ఏర్పాటు చేసుకున్న షాపును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకు లింకేజీతో పాటు, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీలు సభ్యులకు ఇచ్చి వారిని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సహకరిస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మోదుగుల సుధీర్‌బాబు, ఏపీఎం పద్మాలత, ఆర్ఐ లక్ష్మణ్, ఏపీజీవీబీ ఫీల్డ్ ఆఫీసర్, సీసీలు, గ్రామదీపికలు, గ్రామసమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## 'శ్మశానవాటిక నిర్మాణాన్ని పూర్తిచేయాలి'

కొణిజర్ల, ఆగస్టు 12: మండలంలోని పల్లిపాడు హిందూ శ్మశానవాటిక నిర్మాణాన్ని పూర్తిచేయాలని గ్రామస్తులు కోరుతుఅన్నరు. దీని నిర్మాణం సగంలోనే ఆగిపోవడంతో ఏడాది కాలంగా చనిపోయిన వారికి ఆ శ్మశాన వాటిక పక్కన ఉన్న చిన్న దారిలో దహన సంస్కారాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానవాటిక నిర్మాణం సగంలోనే ఆగిపోవడంతోపాటు దాని గేటుకు తాళం వేసి ఉండడంతో చనిపోయిన వారిని ఆ దారిలో ఒకేచోట దహనం చేయాల్సి వస్తోందని, దాని వల్ల అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందని వాపోయారు.

## అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన

ఖమ్మం రూరల్, ఆగస్టు 12: మండలంలోని పలు గ్రామాల్లో మంజూరైన రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. తొలుత తల్లంపాడు గ్రామంలో తల్లంపాడు, పైనపల్లి గ్రామాలకు మంజూరైన పనులకు, ఆరెకోడు, ఆరోకోడు తండాలో సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పట్టుదల ఉంటే సాధించలేనిదేమీలేదు: సీఐ

సత్తుపల్లి, ఆగస్టు 12: విద్యార్థులు పట్టుదలతో శ్రమిస్తే సాధించలేనిది ఏమీ ఉండదని సత్తుపల్లి సీఐ కిరణ్ సూచించారు. మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి డీఏవీ స్కూల్లో సోమవారం జరిగిన ఇనిస్టిట్యూట్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. విద్యార్థులు చదువును ఇష్టంగా ఎంచుకొని ప్రణాళిక ప్రచారం చదవాలని సూచించారు. స్కేర్ అండ్ రూట్స్‌లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన పీ.స్లోకాకిరణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రశంసించి జ్ఞాపికలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషసాయి, పీడీ కే.కుమారస్వామి, పీఈటీ రామిశెట్టి, స్కౌడ్స్ మాస్టర్ వాసుదేవరావులను సాయిస్ఫూర్తి చైర్మన్, ఎంపీ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, తెలంగాణ జోన్ రీజినల్ ఆఫీసర్ జీఆర్‌కే ప్రసాద్, సాయిస్ఫూర్తి కళాశాల చైర్మన్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విత, సాయిస్ఫూర్తి కళాశాల ప్రిన్సిపాల్ శేషారత్నకుమార్ అభినందించారు.

## 'నాటకోత్సవాలు జయప్రదం'

ఖమ్మం, ఆగస్టు 12 : నెలనెలా వెన్నెల 7వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటకోత్సవాలు జయప్రదం చేసిన ప్రతిఒక్కరికి నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఓ కళావైభవంలాగా నాటిక పోటీలు జరిగాయని అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, కోశాధికారి దేవేంద్ర వీవీ అప్పారావు, నాగబత్తిని రవి తదితరులు తెలిపారు.

## జాతీయస్థాయి క్రికెట్ టీ-10 పోటీలకు పెనుబల్లి విద్యార్థి

పెనుబల్లి, ఆగస్టు 12: జాతీయస్థాయి క్రికెట్ టీ-10 పోటీలకు సత్తుపల్లి మదర్‌థెరిసా కళాశాలలో విద్యనభ్యసిస్తున్న పెనుబల్లి మండలం పాతకుప్పనకుంట్ల గ్రామ నివాసి వర్దబోయిన యశ్వంత్‌కుమార్ ఎంపికయ్యాడు. గతంలో మూడు రాష్ట్రాల క్రికెట్ పోటీల్లో ఇతడు పాల్గొని బహుమతులు పొందాడు. ఇప్పుడు అక్టోబర్ 18 నుంచి 25 వరకు ఉత్తరాఖండ్‌లో జరగబోయే జూనియర్ టీ-10 క్రికెట్ చాంపియన్‌కు ఎంపికయ్యాడు. ఇతడి ఎంపిక పట్ల మదర్‌థెరిసా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి సీలింగ్ ఫ్యాన్ల వితరణ

పెనుబల్లి, ఆగస్టు 12: లయన్స్ క్లబ్ ఆఫ్ సప్తగిరి వీఎం బంజర ఆధ్వర్యంలో క్లబ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.అనంత్, నేరేటి బాబురావు పుట్టిన రోజు సందర్భంగా వారి ఆర్థికసాయంతో పెనుబల్లి ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి సోమవారం మూడు సీలింగ్ ఫ్యాన్లు వితరణగా అందజేశారు. క్లబ్ బాధ్యులు ఎస్‌కే అబ్దుల్‌సలాం, శ్రీధరాల సుబ్బారావు, కారుమంచి ఆనంద్, నాళ్ల జయరాం, పోట్రు వెకంటేశ్రరావు, సుంకర సత్యనారాయణ, కొమ్మినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చింతకాని, ఆగస్టు 12: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పాతర్లపాడు గ్రామంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మృతుడు మాతంగి రమేశ్ (30) తన తండ్రి మందలించాడన్న కారణంతో ఈ నెల 10న ఇంట్లో తెచ్చి ఉన్న గడ్డి మందు సేవించాడు. గమనించిన కుటుంబసభ్యులు ఖమ్మంలో ఓ ప్రవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నాడు. పరిస్థితి విషమంగా మారి సోమవారం తెలంలవారుజామున మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాధు మేరకు ఎస్సై షేక్ నాగుల్‌మీరా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తమ్ముడిపై దాడి, నలుగురిపై కేసు నమోదు

చింతకాని, ఆగస్టు 12: తమ్ముడిపై దాడి చేసిన నలుగురిపై కేసునమోదైన ఘటన మండలంలోని బస్వాపురం గ్రామంలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆవుల తిరుపతిరావును తన సోదరులు పోలం గెట్టు పంచాయతీ, ఆస్థి పంపకాల విషయంలో జరిగిన ఘర్షణలో తిరుపతిరావుపై దాడి చేశారు. తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన నలుగురిపై కేసు నమోదైందని ఎస్సై ఎస్సై షేక్ నాగుల్‌మీరా తెలిపారు.

## డెంగీపై అవగాహన కలిగి ఉండాలి

మధిర రూరల్, ఆగస్టు 12: ప్రస్తుత సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న తరుణంలో టైఫాయిడ్, డెంగీ లాంటి విషజ్వరాలపై ప్రతిఒక్క రూ అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పృథ్వీరాజ్ అన్నారు. మండలంలోని ఖమ్మంపాడు ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని ఎస్సీకాలనీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వీ వెంకటేశ్వర్లు, పారా మెడికల్ సిబ్బంది ఇంటింటికెళ్లి ఆరోగ్య రక్షణ పై అవగాహన కల్పించారు. జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వాసుపత్రికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు లంకా కొండయ్య, గ్రామ కార్యదర్శి పవన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బీమా నగదు అందజేత

ఎర్రుపాలెం, ఆగస్టు12: మండలంలోని గుంటుపల్లి గోపవరం గ్రామానికి చెందిన సొసైటీ సభ్యుడు మందడపు సూర్యనారాయణ ఇటీవల మృతి చెందారు. ఆయనకు మంజూరైన బీమా నగదు రూ.50 వేలు సోమవారం మృతుడి భార్య రమాదేవికి డీసీసీబీలో అయ్యవారిగూడెం సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ దివ్య, అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, సీఈవో మోహన్‌రావు, సొసైటీ సిబ్బంది మురళీ, రమణరెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలి: బీఆర్ఎస్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కారేపల్లి, ఆగస్టు 12: అర్హులైన రైతులందరికీ రుణమాఫీని వర్తింపజేయాలని బీఆర్ఎస్ మైనార్టీ విభాగం నాయకుడు షేక్ గౌసుద్దీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ కారణాలు చూపుతూ బ్యాంకర్లు అనేకమంది రైతులకు రుణమాఫీని వర్తింపజేయడం లేదని అన్నారు. బ్యాంకుల ద్వారా పంటల పెట్టుబడి రుణాలు తీసుకున్న రైతులకు ఎటువంటి షరతులూ లేకుండా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఉపసర్పంచ్ మణికొండ నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు ఖలీలుల్లాఖాన్, సద్దాం, ఫిరోజ్, కొణిదల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లికి సత్కారం

మంత్రి జూపల్లిని సత్కరిస్తున్న సారథి కళాకారులు

ఖమ్మం, ఆగస్టు 12 : ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చిన పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఖమ్మం జిల్లా సారథి కళాకారులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఖమ్మం నగరంలోని ఖిల్లా దగ్గర మంత్రిని కలిసి వినతిపత్రం అందించి తమకు రావాల్సిన బకాయిలు విడుదల చేయాలని కోరారు. త్వరలో బకాయిలు మొత్తం విడుదల చేస్తామని మంత్రి వారికి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో కాల్వకట్ల జాన్, మిమిక్రీ సుధాకర్‌రావు, పరకాల అజయ్, మాచర్ల కృష్ణ, బంక భద్రయ్య, కొమ్ము రమేశ్ ఉన్నారు.

## ప్రజావాణికి స్పందన కరువు

తిరుమలాయపాలెం, ఆగస్టు 12: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దారు రామకృష్ణ, ఎంపీడీవో సీలార్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజావాణికి ప్రజల నుంచి స్పందన రాలేదు. కార్యక్రమంలో 19 దరఖాస్తులు మాత్రమే ప్రజలు అందజేశారు. మండలంలోని పలు ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిచేయాలని వినతిపత్రం అందజేశారు.

## విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు : ఎస్ఈ

మామిళ్లగూడెం, ఆగస్టు 12 : జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు జిల్లావ్యాప్తంగా టీజీఎస్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో పంపిణీ వ్యవస్థలను పటిష్టం చేశామని ఖమ్మం సర్కిల్ ఎస్ఈ ఏ.సురేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా నూతనంగా వివిధ సామర్థాలు గల 55 ట్రాన్స్‌ఫార్మర్లను పెట్టామని, దీనిద్వారా ఓవర్‌లోడ్ భారం తగ్గిందన్నారు. అదేవిధంగా లైన్లు లూజు అయినచోట 2,187 మిడిల్ ఫోల్స్, అవసరం ఉన్నచోట 1,192 కొత్త పోల్స్‌ను వేశామన్నారు. 44 ప్రాంతాల్లో తక్కువ ఎత్తు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు గద్దెలు పెంచడంతోపాటు పాతలైన్లు మార్చి కొత్తగా 11 కేవీ లైన్లు 